ఫీవర్ ఆస్పత్రికి పోటెత్తుతున్న రోగులు


ఫీవర్ ఆస్పత్రి ఓపీ వద్ద బారులుతీరిన రోగులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఎండలు పెరుగుతుండడంతో ప్రజలు వివిధ రోగాలతో ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ఈ నెలలో రోజూ ఓపీ 400కు పైగానే నమోదవుతుంది. సోమవారం 540 ఓపీ కేసులు నమోదు కావడం గమనార్హం. ఎండలు మండిపోతుండడంతో వాంతులు, విరేచనాలు, డయేరియా, చికెన్‌ఫాక్స్, టైఫాయిడ్ వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్న వారు ఆస్పత్రికికి వస్తున్నారు. సోమవారం దాదాపు 51 మంది ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారని, మమ్స్ 11, డిఫ్తీరియా 5, డెంగ్యూ 1, చికెన్‌ఫాక్స్ 2 కేసులు నమోదయినట్లు వైద్యులు తెలిపారు. వేసవి సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

పిల్లల హెయిర్‌స్టైల్, నడవడికపై దృష్టి సారించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పిల్లల హెయిర్‌స్టైల్, నడవడికపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నియంత్రణను పెంచాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించని సమాజం ఎప్పటికీ ముందుకు పోదన్నారు. పిల్లలను అతిగారాబం చేస్తే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. రాత్రి పదిలోపు పడుకోబెట్టడం, ఉదయం ఏడులోపు లేవడం అలవాటు చేయాలన్నారు. పిల్లలను మార్చే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.


ఉద్యమకారుల సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన నరేందర్‌రెడ్డి

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించడమే లక్ష్యం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్ తెలిపారు. సోమవారం జేఏసీ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. 17 ఎంపీ స్థానాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని, సదస్సులు నిర్వహించి క్రిస్టియన్ మైనారిటీలను ఒకేతాటిపైకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోచైర్మన్ మేకల సారయ్య, నాయకులు దాసరి శ్యామ్‌రావు, రత్నరాజు, బంగారి రమేష్, సురేందర్, జన్ను ప్రభాకర్, సంజీవ్‌కుమార్, జాన్‌పాల్, పెప్సీబా తదితరులు పాల్గొన్నారు.

'మానవ హక్కుల రక్షణకు కృషి'

కవాడిగూడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తానని ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ సహాయ కార్యదర్శి దండుగల రామకృష్ణ తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ సిద్దు చేతుల మీదుగా మానవ హక్కుల సంస్థ తెలంగాణ రాష్ట్ర సహా కార్యదర్శిగా దండుగుల రామకృష్ణకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బలహీన వర్గాల హక్కులను కొంతమంది అధికార బలంతో కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'గృహజ్యోతి'కి రేషన్‌కార్డు లింక్ పెట్టొద్దు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లేకపోయినా గృహజ్యోతి దరఖాస్తు తీసుకోవాలని బీజేపీ గాంధీనగర్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు ఉన్న వారి నుంచి మాత్రమే గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారని ఆరోపించారు. రేషన్‌కార్డు కోసం కూడా దరఖాస్తు చేసుకున్నామని ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన రశీదును చూపించినా కూడా సిబ్బంది ఒప్పుకోవడంలేదన్నారు. రేషన్‌కార్డు లేకపోయినంత మాత్రాన గృహజ్యోతి పథకానికి పేదలు అర్హులు కాదనేలా వ్యవహరించడం సరికాదన్నారు.

ప్రవీణ్ ఐపీఎస్ మూవీకి ఉచిత ప్రవేశం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జీవితచరిత్ర ఆధారంగా దుర్గాదేవినాయుడు దర్శకత్వంలో తెరకెక్కిన ప్రవీణ్ ఐపీఎస్ (ఇక ప్రజాసేవలో) సినిమాను మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో వీక్షించేందుకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు రుద్రవరం సునీల్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రేక్షకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నిరసన కార్యక్రమంలో వి.విజయ్‌కుమార్ తదితరులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సదుపాయాలు కల్పించాలి


రాంనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇళ్లలో కనీస సదుపాయాలు కల్పించాలని 2బీహెచ్‌కే అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 2బీహెచ్‌కే అసోసియేషన్ ఇన్‌చార్జి వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా బడ్జెట్ కేటాయించి కనీస సదుపాయాలు కరెంట్, లిఫ్టు, మంచినీటి పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అహ్మద్‌గూడ, రాంపల్లి, శామీర్‌పేట, మురహరపల్లి ఏరియాల 2బీహెచ్‌కే లబ్ధిదారులు పాల్గొన్నారు.


నృత్యకళాకారులను అభినందిస్తున్న సతీష్

ఏకాగ్రతను అలవర్చుకుంటే ఉన్నతంగా రాణించొచ్చు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): క్షమాగుణం, ఏకాగ్రత అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించొచ్చని ప్రముఖ సంపాదకులు సతీష్ అన్నారు. సోమవారం ఓం నమో నటరాజ కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నిర్వహించిన నృత్యప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పిల్లలకు సంప్రదాయకళలను నేర్పించాలన్నారు. తొలుత చిన్నారి నృత్యకళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అభినందించి సన్మానించారు.

అమర్ షహీద్ భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణరావు, సమ్మన్న, జయసూర్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సంఘం నూతన భవనంలో సాహితీ- సంగీతం సమ్మేళనం, ప్రముఖ రచయిత జయసూర్య రచించిన అమర్ షహీద్ భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాగృతి ఎడిటర్ గోపరాజు నారాయణరావు, తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు ఈటల సమ్మన్న తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.


బాపూజీ నగర్ చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ - ముషీరాబాద్


బాపూజీ నగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ మహంకాళి జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కంచి కుమార్ - ముషీరాబాద్


బీజేపీ నగర కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, యువమోర్చా నాయకుడు సందీప్‌యాదవ్, యశ్వంత్, అవినాష్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


కాచిగూడ శివాజీనగర్‌లోని నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


రామకృష్ణానగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి తదితరులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

దేశం గర్వించదగ్గ మహావీరుడు ఛత్రపతి శివాజీ : ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు రాజకీయ పార్టీలు, హిందూవాహిణి సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాయి. రాంనగర్ మీసేవ, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాగులు యాదవ్, సభ్యులు వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ శివాజీ చిత్రపటానికి నివాళులర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


బాగ్‌అంబర్‌పేటలో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ తదితరులు


రాంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఎం.నాగేష్‌ముదిరాజ్, బాలేష్‌కుమార్, ప్రవీణ్ తదితరులు

వివాదంగా మారిన శివాజీ విగ్రహావిష్కరణ

అనుమతులు లేవని ఏర్పాటును అడ్డుకున్న పోలీసులు

ముషీరాబాద్ : బాపూజీనగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థానికులు జీ.ఎన్ చారి, తుమ్మ శ్రీనివాస్, నరేందర్, అమరేందర్‌యాదవ్, కేసరి శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్‌నాయుడు, తిరుపతి కమిటీగా ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో మూడున్నర అడుగుల ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని తయారు చేయించారు. బాపూజీనగర్ చౌరస్తా సమీపంలో గల ప్రొఫెసర్ జయశంకర్, మహాత్మాగాంధీ విగ్రహాల పక్కన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు నాలుగు రోజుల క్రితం దిమ్మె నిర్మించారు. విషయం తెలుసుకున్న వారసిగూడ పోలీసులు విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని అడ్డుకున్నారు. అనుమతులు తీసుకుంటేనే ఏర్పాటుకు అనుమతి ఇస్తామని పోలీసులు సూచించడంతో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విగ్రహ ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారాసిగూడ సీఐ శంకర్ దిమ్మె నిర్మించిన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఛత్రపతి జయంతిని సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పెద్దఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తర్వాత ఛత్రపతి చిత్రపటాన్ని ఏర్పాటే చేసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరై నివాళులర్పించారు. ఛత్రపతి విగ్రహాన్ని టేబుల్‌పై పెట్టి వేడుకలు నిర్వహించారు. దీంతో గొడవ సద్దుమనిగింది.


ఛత్రపతి శివాజీ విగ్రహం



సమాజానికి మార్గనిర్దేశం చేసే రచనలు రావాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్ ● ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గనిర్దేశం చేసేలా మేధావులు, విద్యావంతులు రచనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. భిన్న భావజాలాలు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒకచోట ఉండటం, పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. పిల్లలకు పుస్తక పఠనాభిరుచిని పరిచయం చేసే విధంగా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. ఆలోచనలను విస్తృతం చేసుకోవాలన్నా, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నా పుస్తకమే ఆధారమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా, వ్యక్తిత్వాన్ని మలచుకోవడానికి పుస్తకాలను ఆశ్రయించాలని హితవుపలికారు. సామాజిక మార్పునకు దోహదపడంతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా రచనలు చేయడం కవులు, రచయితల బాధ్యత అని అన్నారు. వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తుకు బాట చూపే ఆశావాహ రచనలు రావాలని ఆకాంక్షించారు.

ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్రలను వక్రీకరిస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవాలు పునాదిగా లిఖించబడిన చరిత్ర పుస్తకాలు చదివి అబద్ధాల చరిత్రను తిప్పికొట్టాలని పాఠకులకు సూచించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్ వ్యక్తుల పట్ల ఉన్న వివక్షకు వ్యతిరేకంగా తమ జీవితాలు ఇతివృత్తంగా మరిన్ని రచనలు రావాలని, అందుకు రచయితలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూపించింది, పరిచయం చేసిందీ పుస్తకమే అని అన్నారు. ఓయూ వీసీ రవీందర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి యాకూబ్, మలుపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్ అధ్యక్షుడిది పురుషాహంకార ధోరణి

- సభను అడ్డుకున్నారని స్త్రీవాద రచయిత్రుల ఆగ్రహం
- నిరసనగా స్టాల్ వద్ద ప్రత్యేక సమావేశం
- ట్రాన్స్ మహిళను పిలిచి అవమానించారని విమర్శలు
- అధ్యక్షుడి తీరు సరికాదన్న సామాజిక ఉద్యమకారులు


మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బుక్ ఫెయిర్ అధ్యక్షుడి పురుషాహంకార ధోరణికి నిదర్శనం స్త్రీ వాద రచయిత్రుల సభను జరగనీయకపోవడం అంటూ రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు నిరసించారు. అధ్యక్షుడి తీరును వ్యతిరేకిస్తూ సోమవారం స్టాల్ నెంబరు 205 వద్ద రచయిత్రి సజయ నేతృత్వంలో స్త్రీవాద రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పలువురు సమావేశం నిర్వహించారు. భిన్న నేపథ్యాలకు చెందిన రచయిత్రులతో 'స్త్రీ వాద రచయిత్రులు - వర్తమాన సవాళ్లు' అంశంపై ఆదివారం తాము నిర్వహించ తలబెట్టిన చర్చాగోష్ఠిని సమయం లేదంటూ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు అడ్డుకున్నారని పలువురు రచయిత్రులు, సామాజిక కార్యకర్తలు విమర్శించారు. ఇది మహిళల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమని అన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణ కమిటీలో మహిళల భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన, ఓ వైపు చెత్త సేకరిస్తూ, డిగ్రీ చదువుతున్న వర్ధమాన రచయిత్రి జయలక్ష్మి, ఒంటరి స్త్రీలపై కథా సంపుటి వెలువరించిన విజయ భండారు, సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ రచనలు చేస్తోన్న పూర్ణిమ తమ్మిరెడ్డి, విప్లవోద్యమంలోని మహిళల కథలను సంకలనం చేసిన అనూరాధ, అపర్ణ తోట, మెర్సీ మార్గరెట్, సాత్విక నన్నెబోయిన, దాసోజు లలిత తదితరులు చర్చా గోష్ఠిలో మాట్లాడాలి అనుకున్న అంశాలను ప్రస్తావించారు. స్త్రీల రచనలకు సంబంధించిన సమావేశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడం అన్యాయమని ఆక్షేపించారు. వీరికి సంఘీభావంగా విజయ్ వంగల పూడి, ఆర్. భరద్వాజ తదితరులు మాట్లాడారు.

వేదికపై వాగ్వాదం

'స్త్రీవాద రచయిత్రులు వర్తమాన సవాళ్లు' సదస్సును చివరి నిమిషంలో రద్దు చేసి విమర్శల పాలైన బుక్ ఫెయిర్ నిర్వాహకులు, ఆ పొరపాటును సరిదిద్దుకొనేందుకు ట్రాన్స్ మహిళా రచయిత్రి, ఉద్యమ కారిణి రచన ముద్రబోయినను ముగింపు సమావేశానికి ఆహ్వానించారు. రచనతో మాట్లాడించాలని కార్యనిర్వాహక సభ్యుడు బాల్‌రెడ్డి సూచించగా.. ఎవర్ని అడిగి ఆమెను పిలిచారంటూ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మండిపడ్డారు. ఈ విషయంలో వేదికపై మంత్రి పొన్న ప్రభాకర్ సమక్షంలో వాగ్వివాదం జరిగింది. మంత్రి జోక్యం చేసుకొని రచన ముద్రబోయినతో మాట్లాడించాలని సభాధ్యక్షుడిని ఆదేశించగా.. గొడవ సద్దుమణిగింది. స్త్రీవాద రచయిత్రుల సదస్సు చివరి నిమిషంలో రద్దవడంపట్ల బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోసారి జరగనీయబోమన్నారు.

ప్రజల హక్కులను అణిచివేస్తున్న కేంద్రం


ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రం అణచివేస్తోందని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. కాషాయీకరణకు పెద్దపీట వేస్తూ హిందుత్వ ఎజెండా అమలు చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఐక్య పోరాటాలు నిర్వహించి బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో మనువాదం - దళితులు -రాజ్యాంగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దళితులు, మైనారిటీలను బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. సదస్సులో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.నర్సయ్య అధ్యక్షత వహించగా ఏఐడీఆర్ఎం అధ్యక్షుడు ఏ.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.నిర్మల్‌కుమార్, కోశాధికారి దేవికుమారి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఇన్‌చార్జి బాలనర్సింహ, ఏసురత్నం పాల్గొన్నారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.7,937 కోట్లు

● నేడు కౌన్సిల్‌లో చర్చ ● ఆమోదం అనంతరం ప్రభుత్వానికి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బడ్జెట్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌తో పోలిస్తే 2024-25 పద్దును రూ.1,713 కోట్లు పెంచుతూ.. రూ.7,937 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. 2023-24 సవరణ బడ్జెట్ మాత్రం రూ.6,990 కోట్లుగా చూపారు. మొదటిసారి జీహెచ్ఎంసీ చేసిన అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలకోసం రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నారు. బడ్జెట్ పెరుగుదలకు ఇది ప్రధాన కారణం కాగా.. మ్యుటేషన్ రుసుము రాబడి అంచనా ప్రస్తుతం రూ.10 కోట్లు ఉండగా దానిని రూ.200 కోట్లకు పెంచారు. ప్రభుత్వం నుంచి ఇతర రూపాల్లో వచ్చే ఆదాయమూ రూ.300 కోట్లకుపైగా పెరుగుతుందని ప్రతిపాదనల్లో చూపించారు. ఆస్తిపన్ను, పట్టణ ప్రణాళికా విభాగాల ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ), కాంప్రహెన్సీవ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం (సీఆర్ఎంపీ)ల కోసం రూ.6,500 కోట్లకుపైగా అప్పు చేసిన నేపథ్యంలో ఆ రుణానికి ప్రతినెలా వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా ఆయా పనులు ప్రభుత్వం చేయాల్సి ఉండడం.. గత సర్కారు ఆదేశాల మేరకు అప్పు చేసిన దృష్ట్యా.. ఆ మొత్తం ప్రభుత్వం ఇవ్వాలనే బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు ఓ అధికారి చెప్పారు. నేటి సమావేశంలో మొదటి సెషన్‌లో ప్రశ్నోత్తరాలపై, రెండో సెషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఆమోదం అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం..

రెవెన్యూ ఆదాయం(రూ.కోట్లలో)
- ఆస్తిపన్ను - రూ.1907 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ - 1600
- ప్రభుత్వం నుంచి - 785
- మ్యుటేషన్ రుసుము - 200
- ట్రేడ్ లైసెన్స్ - 110 ● ప్రకటనలు - 20
- ఎస్టేట్ - 10
- రుణ చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు - 1200
- ఇతరత్రా- 106

మొత్తం- 5938

మూలధన ఆదాయం (రూ.కోట్లలో)
- 15వ ఫైనాన్స్ కమిషన్ - 350
- టీడీఆర్ - 300 ● ఇతర గ్రాంట్లు - 11
- డిపాజిట్ వర్క్ రశీదులు - 8
- ఇతరత్రా రశీదులు - 2
- రుణం- 128
- ప్రభుత్వం నుంచి గ్రాంట్లు - 1200

మొత్తం- 1999

బైక్ దొంగ అరెస్ట్

అంబర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విలాసాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని అంబర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మచ్చ వెంకట్రావు(53) బోడుప్పల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. డబ్బు కోసం బైకు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈనెల 12న షేక్‌హుస్సేన్ బైక్ అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో బైకు చోరీకి గురైంది. గమనించి అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు వెంకట్రావు బైకు దొంగతనం చేసినట్టు గుర్తించారు. 19న సోమవారం అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

'ప్లాస్టిక్ రహిత మేడారం జాతరకు సహకరించాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భక్తులందరిపైనా ఉందని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి అన్నారు. ఈ మేడారం జాతరలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా, కాలుష్యాన్ని పెంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ అధ్యక్షుడు డాక్టర్ సీ.హెచ్.భద్ర, ప్రధాన కార్యదర్శి కోనేటి నిఖిల్‌సాయి, ప్రతినిధి స్వర్గం మహేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ఎప్పుడు లేని విధంగా మేడారం జాతరలో పసుపు, కుంకుమలు మొదలుకుని అమ్మవార్లకు సమర్పించే బెల్లం వరకు పూర్తిగా విష రసాయనాలు వాడుతూ జీవవైవిధ్యం పూర్తిగా దెబ్బతీస్తున్నారని అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన సేవ్ మేడారం క్లీన్ మేడారం పేరిట రూపొందించిన వాల్‌పోస్టర్, క్లాత్ బాగులను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రిజ్వాన్ అహ్మద్, పూలన్‌దేవి, మధుబాబు, సాగర్, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థులతో మాట్లాడుతున్న సీపీ తరుణ్‌జోషి

పోలీసు శిక్షణ గొప్ప అవకాశం

అంబర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు క్రమశిక్షణ నేర్పి వారు పోలీసు శాఖలో సమర్థవంతంగా పని చేసేటట్లు చేయడమే పోలీసు శిక్షణ ప్రధానోద్దేశమని రాచకొండ సీపీ తరుణ్‌జోషి అన్నారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణకు వెళ్లి అభ్యర్థులకు సోమవారం అంబర్‌పేట సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులు పలు ప్రాంతాలలో శిక్షణ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో నేర్పించే అంశాలను ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. 9 నెలల శిక్షణలో నేర్చుకునే అంశాలు విధి నిర్వహణకు తోడ్పడతాయని అన్నారు.

'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న జె.దశరథ్

రాంనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ అనంతపూర్ జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' విలేకరి కృష్ణ, ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఏపీ సీఎం నిర్వహించిన బహిరంగసభను కవర్ చేయడానికి వెళ్లిన కృష్ణ, ఫొటోగ్రాఫర్‌పై దాడి జగన్ కనుసన్నుల్లోనే జరిగిందన్నారు.

చిక్కడపల్లి : విలేకరి శ్రీకృష్ణ, ఫొటోగ్రాఫర్‌పై దాడిని గాంధీనగర్ డివిజన్ టీడీపీ కన్వీనర్ భవానిశ్రీనివాస్ ఖండించారు. జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషచర్య అన్నారు.